క్లుప్తంగా

కేటీ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట కేటీ రోడ్డు(తమ్మిన పోతరాజు రోడ్డు) నుంచి గణపతిరావు రోడ్డుకు వెళ్లే మార్గంలో మంగళవారం నగరపాలకసంస్థ సిబ్బంది స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. కేటీ రోడ్డు నుంచి గణపతిరావు రోడ్డుకు వెళ్లే మలుపు వద్ద ఉన్న నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో నగరపాలకసంస్థ సిబ్బంది స్థానిక కార్పొరేటర్ల సూచనలతో డివైడర్‌ను కొంతమేర తొలగించి ఇబ్బందుల నివారణకు చర్యలు చేపట్టారు. నెహ్రూబొమ్మ సెంటర్ మలుపు వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా యుద్ధ ప్రాతిపదికన స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేశారు. పనులను స్థానిక కార్పొరేటర్లు మహదేవు అప్పాజీరావు, మరుపిళ్ల రాజేష్, ఏఈ శ్రీనివాస్, స్థానిక ప్రముఖులు పర్యవేక్షించారు.

వరద బాధితుల సహాయార్థం ఏపీటీడీసీ విరాళం



సాక్షి, అమరావతి: వరద బాధితుల సహాయార్థం ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఉద్యోగులు ఒక రోజు జీతాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం సీఎం చంద్రబాబును కలిసి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు.

కల్యాణిదేవిగా భ్రమరాంబ దర్శనం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో భ్రమరాంబ అమ్మవారు మంగళవారం శ్రీకల్యాణిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కార్తిక నక్షత్రదీక్షా మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని శ్రీ కల్యాణిదేవిగా అలంకరించారు. ప్రత్యేక అలంకారంలోని స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, హోమాలు, అర్చనలు జరిపారు. శ్రీ అయ్యప్ప స్వామివారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈఓ నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

బ్లేడ్ బ్యాచ్‌కు అడ్డా.. నెహ్రూ బస్‌స్టేషన్



- ఆర్టీసీ ఉద్యోగులపై నిరంతర దాడులు
- భయాందోళనలో ఉద్యోగులు, సిబ్బంది
- నిద్రావస్థలో పోలీసులు



పండిట్ నెహ్రూ బస్ స్టేషన్

బస్టాండ్(విజయవాడపశ్చిమ): ఆసియా ఖండంలోనే అతి పెద్ద బస్ స్టేషన్లలో ఒకటిగా గుర్తింపు పొందిన పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నేడు బ్లేడ్ బ్యాచ్‌కు అడ్డాగా మారింది. గతంలో రైల్వే స్టేషన్, వన్‌టౌన్ ప్రాంతాల్లో చెలరేగిన బ్లేడ్ బ్యాచ్ ఇప్పుడు బస్ స్టేషన్‌ను అడ్డాగా మార్చుకుని హల్‌చల్ సృష్టిస్తున్నాయి.

వరుస దాడులతో కలకలం

గతంలో రైల్వే స్టేషన్‌ను అడ్డాగా చేసుకుని తమ కార్యక్రమాలు సాగించిన బ్లేడ్ బ్యాచ్ అక్కడ రైల్వే పోలీసులు వారిపై గట్టి చర్యలు తీసుకోవటంతో తమ కార్యకలాపాలకు బస్ స్టేషన్‌ను అడ్డాగా మార్చుకున్నారు. పోలీసుల నిఘా తక్కువగా ఉండటంతో తమ పనులకు అడ్డే లేకుండా చెలరేగిపోతున్నారు. చీకటి పడితే మద్యం, గంజాయి సేవించడంతో పాటు నిద్రకు ఇక్కడే ఉపక్రమిస్తున్నారు. మద్యం, గంజాయి మత్తులో ప్రయాణికులపై దాడులు చేయటం, వారి నుంచి బలవంతంగా డబ్బులు, విలువైన వస్తువులను దొంగిలించటం లక్ష్యంగా మార్చుకున్నారు. అడ్డుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగులపై దాడులకు సైతం పాల్పడుతున్నారు. వరుస దాడులు కలకలం రేపుతున్నాయి.

భయాందోళనలో ఆర్టీసీ ఉద్యోగులు...

బ్లేడ్ బ్యాచ్ సభ్యులు మత్తులో తమలో తాము గొడవలు పడటమే కాకుండా ఆర్టీసీ ఉద్యోగులపై కూడా దాడులకు తెగబడుతున్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. గతంలో టికెట్ బుకింగ్ కౌంటర్‌లోని ఉద్యోగులపై దాడిచేసిన బ్లేడ్ బ్యాచ్ ఈ నెల 11న మరోసారి బస్టాండ్‌లో డ్యూటీలో ఉన్న కంట్రోలర్‌పై దాడి చేసి గాయపర్చటంతో తమకు భద్రత లేకుండా పోయిందని ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు. బస్ స్టేషన్‌లో ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులపై బ్లేడ్ బ్యాచ్ సభ్యులు దాడులు చేసి గాయపరుస్తున్నా పోలీసులు పట్టించుకోక పోవటంపై ప్రయాణికులు మండిపడుతున్నారు.

కొరవడిన నిఘా..

నిత్యం వేలాది మంది ప్రయాణికుల రాకపోకలతో ఎప్పుడు రద్దీగా ఉండే పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో పోలీసుల నిఘా ఉండడం లేదు. దీంతో బ్లేడ్ బ్యాచ్, జేబు దొంగల హవా ఎక్కువైందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు వీరిపై నిఘా ఏర్పాటు చేసి వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

నగరంలో ఆక్రమణల తొలగింపు



సితార జంక్షన్ వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): నగరంలో రహదారులపై ట్రాఫిక్‌కు అవరోధంగా ఉండే ఆక్రమణల తొలగింపుపై వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం మంగళవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. సర్కిల్-1, 3 ఏరియాల్లో ఆక్రమణలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా ట్రాఫిక్ పోలీసుల సహకారంతో అధికారులు ఆక్రమణలను తొలగించారు. సర్కిల్-1 పరిధిలోని సితార జంక్షన్ వద్ద ఫుడ్‌కోర్టు, సర్వీస్‌రోడ్డు ప్రతిపాదన కలిగిన ప్రాంతంలో ఆక్రమణలను వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. సితార జంక్షన్ వద్ద రోడ్డును 200 అడుగులు వెడల్పు చేస్తున్నామని, అందులో భాగంగా ఆక్రమణలను తొలగించామని వీఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్ తెలిపారు. వీటితో పాటు సర్కిల్-3 పరిధిలోని మొగల్రాజపురంలోని మధుగార్డెన్స్ వద్ద ఉన్న మధుమహాలక్ష్మి కాంప్లెక్స్‌పై అనధికారికంగా నిర్మిస్తున్న కట్టడాన్ని వీఎంసీ అధికారులు అడ్డుకున్నారు. ఆక్రమణ నిర్మూలన దళం గోడలను తొలగించింది. పిన్నమనేని పాలిక్లినిక్‌రోడ్డులో తోపుడు బండ్లు, కంటైనర్లను వీఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. స్పెషల్ డ్రైవ్‌ను అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహనబాబు పర్యవేక్షించారు. వీటితో పాటు కేదారేశ్వరపేటలో ఉన్న మ్యాంగో మార్కెట్ వద్ద ఆక్రమణలను తొలగించారు.

ప్రహరీ కూల్చివేతపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గొల్లపూడి మైలురాయి పంట కాలువ రోడ్డులోని ఓ స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీ కూల్చివేసిన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... పంట కాలువ రోడ్డులో సీహెచ్ శ్రీనివాసరావు, డేకల త్రినాథరావులకు 204/3 సర్వే నంబరులో 584 గజాల స్థలం ఉంది. స్థలానికి ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేశారు. ఈనెల 23వ తేదీ రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు కారులో వచ్చి జేసీబీతో గేటును, ప్రహరీ మూడు వైపులా కూల్చివేశారు. చెంచు కొండయ్య అనచరులు గేటు, ప్రహరీ కూల్చివేశారని భవానీపురం పోలీసులకు కొల్లి జయప్రకాష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక ఏకాదశి, మంగళవారాన్ని పురస్కరించుకుని కొత్తపేట వీరాంజనేయ స్వామి వారి సన్నిధిలోని అయ్యప్ప స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో వేం చేసిన శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ స్వామివారికి విశేషంగా అలంకరించగా, పెద్ద ఎత్తున అయ్యప్పలు, భవానీలు, శివ దీక్షాపరులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీహరిహర అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో దీక్షాదారులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈవో రావూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

మల్లేశ్వర స్వామికి విశేషంగా అభిషేకాలు



సహస్ర లింగార్చన నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక ఏకాదశిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామివారికి మంగళవారం విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు స్వామి వారికి పంచామృత అభిషేకాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. పలువురు ఉభయదాతలు, భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన నిర్వహించారు. ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి, ఆలయ అర్చకులు సహస్ర లింగార్చనను శాస్త్రోక్తంగా జరిపించారు. పలువురు ఉభయదాతలు లింగార్చనలో పాల్గొన్నారు.

స్వామివారికి ఊంజల్ సేవ

సాయంత్రం స్వామి వారికి పంచహారతుల సేవ, అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపాలంకరణ సేవ జరిగింది. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల ఉత్సవ మూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు దీపాలంకరణ సేవను ప్రారంభించారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించగా, పలువురు ఆలయ అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా సేవలో పాల్గొన్నారు. ఏకాదశిని పురస్కరించుకుని మల్లేశ్వర స్వామివారి ఆలయం, మహామండపం వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్తిక మాసం విశేష పర్వదినాలలో స్వామివారి ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

ఘనంగా వర్గీస్ కురియన్ జయంతి



కురియన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్వేత విప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ ఆదర్శ సూత్రాలను పాటిస్తూ పాడి రైతుల అభ్యున్నతికి విజయ డెయిరీ కృషి చేస్తోందని చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. డాక్టర్ వర్గీస్ కురియన్ 103వ జయంతిని పురస్కరించుకుని పాల ప్రాజెక్టు పరిపాలనా కార్యాలయం ఆవరణలోని కురియన్ విగ్రహానికి చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబులతో పాటు ఇతర బోర్డు డైరెక్టర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. కురియన్ నిర్దేశించిన సూత్రాలను తూ.చా. తప్పకుండా పాటిస్తున్న కృష్ణా మిల్క్ యూనియన్, పాడి రైతుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు.

పాడి రైతుల అభివృద్ధికి కృషి..

పాల సేకరణ ధరతో పాటు బోనస్‌లను దేశంలోనే అత్యధికంగా చెల్లిస్తుంది విజయ డెయిరీ ఒక్కటేనని పేర్కొన్నారు. వినియోగదారుడి వద్ద నుంచి తీసుకున్న ప్రతి రూపాయిలో 80 శాతం నేరుగా పాడి రైతులకే చెల్లిస్తున్నామని చెప్పేందుకు ఎంతో గర్వపడుతున్నామని చెప్పారు. ఇటీవల ఏర్పడిన విపత్తు పరిస్థితుల్లో సమితి సిబ్బంది చూపిన నిబద్ధత, సంస్థ తిరిగి పునఃప్రారంభించుకునేందుకు చేసిన కృషి ఎనలేనిదని ఎండీ కొల్లి ఈశ్వరబాబు పేర్కొన్నారు. కురియన్ స్ఫూర్తితోనే ప్రతి ఒక్కరూ యూనియన్ అభివృద్ధికి తద్వారా లక్షా యాభై వేల పాడి రైతుల అభివృద్ధికి మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విజయ డెయిరీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ ఆకుల రాజ్‌కుమార్‌కు కన్నీటి వీడ్కోలు

ఆకుల శ్రీనివాస్‌ను పరామర్శించిన మాజీ సీఎం జగన్



రాజ్‌కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, కాపు నేత ఆకుల శ్రీనివాస్ కుమార్ చిన్న కుమారుడు డాక్టర్ ఆకుల రాజ్‌కుమార్ అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. భవానీపురంలోని శ్రీనివాస్ కుమార్ స్వగృహం నుంచి రాజ్‌కుమార్ అంతిమ యాత్ర బయలుదేరింది. పార్టీలకు అతీతంగా వందలాది మంది నాయకులు, ప్రజలు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. అంతకు ముందు రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ఆయన ఆదివారం మరణించిన సంగతి తెలిసిందే.

ధైర్యం చెప్పిన మాజీ సీఎం వైఎస్ జగన్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను ఫోన్‌లో పరామర్శించారు. ఘటన ఎలా జరిగింది తదితర వివరాలు అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని, ఓదార్చారు. శ్రీనివాస్ కుమార్‌ను పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యులు షేక్ ఆసిఫ్, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎస్సీ సెల్ నాయకులు పాదిలి చంటిబాబు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్‌రావు, బొండా ఉమామహేశ్వరరావు, వసంత కృష్ణప్రసాద్ తదితరులు ఉన్నారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కార్తిక ఏకాదశిని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో మంగళవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన కల్యాణ మండపంలో ఉదయం ఆలయ ప్రధాన అర్చకుడు వినుకొండ రామరత్నమాచార్యుల పర్యవేక్షణలో పలువురు ఉభయ దాతలు, భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. అర్చకులు రామరత్నమాచార్యులు కార్తిక మాస విశేషాన్ని, సత్యనారాయణ స్వామి వ్రత ఫలితాన్ని చక్కటి వ్యాఖ్యానంలో భక్తులకు వివరించారు. అనంతరం స్వామివారి దర్శనం కల్పించి, తులసీ దళార్చన నిర్వహించారు. సామూహిక వ్రతాలను పురస్కరించుకుని దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మిథిలానగర్ ప్రహరీ కూల్చివేతపై రగడ



ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): మిథిలానగర్(రాజు గారి ప్లాట్లు)లో ప్రహరీ కూల్చివేసిన ఘటనపై మంగళవారం మధ్యాహ్నం స్థానికులు ఆందోళనకు దిగారు. మిథిలానగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి మల్లేశ్వరరావు వెల్లడించిన వివరాల ప్రకారం మిథిలానగర్‌కు ఆనుకుని ఉన్న ఆర్‌ఎస్ 18/1, 18/3 సర్వే నంబర్లలో ఉన్న 78 సెంట్ల ఖాళీ స్థలాన్ని కామాదుల సూరిబాబు, కబీర్ పాషాలకు కోర్టు రిజిస్ట్రేషన్ చేసింది. కొంతకాలగా ఈ స్థలం వివాదాస్పదంగా ఉంది. ఈ క్రమంలో వివాదాస్పద స్థలం ఉత్తరం వైపు మిథిలానగర్ వాసులు సరిహద్దు గోడ నిర్మించుకున్నారు. స్థలంలోకి లారీలు, ట్రాక్టర్ల రాకపోకలకు గోడ కూల్చారు. అయితే ఆదివారం అర్ధరాత్రి సమయంలో సూరిబాబు, కబీర్ పాషా అనుచరులు 3, 4వ లైన్ల చివరిలోని ప్రహరీని కూల్చివేశారు. అప్పుడే వారు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చేసరికి సూరిబాబు అనుచరులు పరారయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం అసోసియేషన్ సభ్యులు సూరిబాబును నిలదీశారు. దీంతో సూరిబాబు, అతని అనుచరుల మధ్య కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. చివరికి కూల్చేసిన ప్రహరీని తమ సొంత ఖర్చుతో పునఃనిర్మిస్తామని సూరిబాబు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

రామలింగేశ్వరుడికి విశేష పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలసుబ్రహ్మణ్యం శర్మ స్వామివారికి పండ్లరసాలతో అభిషేకం చేశారు. వివిధ రకాల పుష్పాలతో అర్చనలు చేసి స్వామివారిని విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతో పౌరులందరికీ సమాన హక్కులు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అవినాష్, మేయర్ భాగ్యలక్ష్మి, మల్లాది, ఆసిఫ్ తదితరులు



చిట్టినగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పోతిన మహేష్



రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న బంకా విజయ, నాయకులు

వించిపేట(విజయవాడపశ్చిమ): రాజ్యాంగంతో దేశంలో పౌరులందరికీ సమాన హక్కులు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ పేర్కొన్నారు. 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం చిట్టినగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోతిన మహేష్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలలోనే అత్యంత శక్తివంతమైన రాజ్యాంగంగా కొనియాడారు. దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని పౌరులందరూ దేశ ఐక్యతకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బంకా విజయ, బూదాల శ్రీనివాసరావు, సీరం వెంకటరావు, వసంత్, సరళ తదితరులు పాల్గొన్నారు.

50వ డివిజన్ ఆధ్వర్యంలో...

స్థానిక 50వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బంకా విజయ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో కలిసి చిట్టినగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు శివ, పి.జార్జ్, బడే మియా, రాము, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను కాపాడాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలన్నింటిలోనూ సమానత్వమే భారత రాజ్యాంగ లక్ష్యమని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నగర ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మేయర్ రాయన భాగ్యలక్ష్మి, సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు, ఆసిఫ్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడి వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక హక్కులను కల్పించిన అంబేడ్కర్ చిరస్మరణీయుడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు షేక్ ఆసిఫ్, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు, లేళ్లపూడి లాజర్ తదితరులు పాల్గొన్నారు.



వీఎంసీలో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీఎంసీ ఏసీ డాక్టర్ చంద్రశేఖర్



అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో..

వించిపేటలో వేడుకలు..

వించిపేట(విజయవాడపశ్చిమ): భారత ఐక్య యువజన సమాఖ్య ఆధ్వర్యంలో వించిపేట కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కసాని గణేష్‌బాబు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ వంటి సంస్థలకు రాజ్యాంగంపై చిత్తశుద్ధి లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో కూడా దళితులకు రక్షణ కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో యువజన సమాఖ్య నాయకులు కంకిపాటి అనిల్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనర్ కార్యాలయంలో

నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమంలో కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఇన్‌చార్జి డీసీపీ(అడ్మిన్) కృష్ణమూర్తి నాయుడు, సీపీఓ అధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో..

గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ గెజిటర్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ టి.అరుణ, అడ్వకేట్ కేజేఎస్ ప్రకాశరావు, ఏబీసీడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆవుల వెంకట్రావు, జాతీయ రిసెర్చ్ స్కాలర్ డాక్టర్ పి.రమేష్, టి.కృష్ణ పాల్గొన్నారు. విద్యార్థులకు రాజ్యాంగం విశిష్టతను వివరించారు. అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గ సభ్యులు రొంపిచర్ల సత్యనారాయణ, రేమల్లె గోపాలం, మిరియాల నరసింహారావు, దారా నాగేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం తరుణ్ బాబు పాల్గొన్నారు.

వీఎంసీలో రాజ్యాంగ వేడుకలు

పటమట(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగాన్ని గురించి పౌరులందరూ తెలుసుకోవాలని వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ కమాండ్ కంట్రోల్ రూంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేషన్ శాఖాధిపతులు, సిబ్బందితో భారత రాజ్యాంగ ప్రవేశికను చదివించారు. చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, సూపరింటెండెంట్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వెంకటేశ్వర రెడ్డి, జి.సామ్రాజ్యం, మేనేజర్ ఏయూబీ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా డీఈవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో సుబ్బారావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాణ సారథులను స్మరించుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌ఎం కార్యాలయంలో..



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని డీఆర్‌ఎం కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే భారత రాజ్యాంగం ఎంతో అత్యున్నతమైందని కొనియాడారు. దేశ పౌరులకు రాజ్యాంగం ఒక దిక్సూచి అని, డివిజన్‌లోని అధికారులు, సిబ్బంది రాజ్యాంగ సూత్రాలను పాటిస్తూ రైల్వే సంస్థ, దేశాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం అధికారులు, సిబ్బందితో కలిసి రాజ్యాంగ ప్రవేశికను చదవి వినిపించారు. ఏడీఆర్‌ఎం కొండా శ్రీనివాసరావు, పలు బ్రాంచ్‌ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.